మళ్ళీ అయిదు కొట్టేదాకా....?

"ఇదిగో..... ఇదిగో"

"........."

"ఏమండోయ్!"

"......."

"....ఇలా చూడండీ"

"........"

"....మెళుకువ రాలేదూ?"

"......"

"....మిమ్మల్నే నండీ"

"ఊ......"

"లేవరూ?"

"........"

".....ఇంకో మాటు చూడండీ"

"......."

"మీగుట్టు మీపెదిమలు బైటపెడుతున్నాయి లెండి.... వోస్"

"......"

"ఏంనవ్వుకుంటా రండీ లోపల్లోపలా?"

"......"

".... వులిక్కిపడ్డారా పాపం?"

"ఏమిటీ అంటున్నావూ?"

"తెల్లవారింది"

"వెలుగు-"

"పొద్దే పొడిచిం దండీ"

"అబ్బా! ఎంత బండనిద్దర పడుతోందీ యీమధ్యా!"

"రాత్రిళ్లు చాలా శ్రమపడుతున్నారు కాదూ మరీ?"

"వొప్పుకున్నావా?"

".... మీరంత కష్టపడి నాటకం రాస్తూవుంటే-"

"రాస్తూవుంటే?"

"పదకొండుగంటలదాకా కవిత్వం చేస్తూ కూచుంటున్నారు కనక - రాత్రంతా సరిగా నిద్రలేక - తెల్లవారగట్ల చల్లగాలికి గాఢనిద్ర పట్టిపోతోంది"

"అయితే?"

"అంచేత మెళుకువ రావడం లేదు"

"రాకపోతే?"

"పెందలాడే లేవలేకపోతున్నారు"

"లేవలేకపోతే?"

"సదే. నేను లేపాను"

"నువ్వెంతసే పయిందీ లేచీ?"

"......."

"అప్పుడే నీళ్లు పోసుకోడమూ, ముస్తీబు కావడమూ-"

"ఇప్పుడే అయింది. పొద్దెక్కిపోవడంవల్ల మిమ్మల్ని లేపుదా మని-"

"నువ్వు లేచినప్పుడే యెందుకు లేపావుకాదూ?"

"తెల్లవారుజాములో నేనా కాస్త సుఖంగాని నిద్రపోకపోతే మీకు జబ్బు చెయ్యదూ?"

"నీకో?"

"నాకేం? మీరు ఆఫీసుకి వెళ్ళాక పన్నెండు గంటల దాకా నేను పడుకుంటూనే వున్నాను కాదూ?"

"అలా చెప్పుమరీ!.... అయినా నువ్వు చీకటి వుందనగానే లేవడమూ, నేను పొద్దుపొడిచీదాకా పడుకోవడమూ - ఈ యెగుడుదిగుడు లేమీ బాగా లేవు రుక్కూ"

"ఇంచక్క వున్నాయి"

"అయితే నాకేం?"

"నాకు మాత్రం యేం?"

"......."

"........"

"మరి లేవనియ్యి"

"......"

"మంచం దిగివూరుకున్నా వేం?"

"ఏం?"

"లేవతియ్యి"

"బాగానే వుంది..,."

"చేతు లందిస్తే యేమవుతుందీ?"

"అ - వ్ - వ"

"ఏంతప్పుమాట అన్నానూ?"

"ఎవ రేనా వింటే?"

"పోనీ మాట్టాడను లే....."

"నాచేతకాదు బాబూ"

"అసలే చెడింది"

"ఏంగునుస్తారండీ?"

"......."

"మళ్ళీ పడుకుంటే - పోనీ నాకేం? మొగం కడుక్కోడానికి పెట్టిన నీళ్ళు చల్లారిపోతాయి. నీళ్లుపొయ్యి ఆరేపోతుంది"

"కొరకంచు లెగసనతోస్తే సరీ"

"డికాక్షన్ చల్లారిపోతే?"

"ఇంకా... మెల్లిగా...."

"కాఫీ సంగతి చెవినిపడితేనే మీకింత చురుకు వచ్చింది, అది కంఠంలో పడితే-"

"పంజాబ్ మెయిల్"

"బాబోయ్!"

"తొరగా పద"

"చన్నీళ్లు తోడనా"

"వేన్నీళ్ళు కాచా ననవూ?"

"తొరపడాని కండీ"

"అంతేకదా?.... ఇంత ప్రేమతోటీ లేపి, చివరికి చన్నీళ్ళలో మునగ మంటా వేమో బాబూ-"

"పా-పం"

2

"పంచదార చాలదు"

"..... ఏం?"

".... ఎక్కువయింది. కసింత డికాక్షన్ పొయ్యి"

".... చూసుకోండి"

"........"

"చాలా?"

"మొదటికే వచ్చింది. ఇంకేం చూడనూ?"

"ఈమాటు పాలు చాలాయి కాదు... కదూ?"
"హ - హ్హా - హ్హా"
"బాగుంది యుక్తి"
"కనిపెట్టేశావ్!... ఏదీ? అరకప్పేనా వుంది నీకూ?"
"నాకిదే యెక్కువ"
"ఛా....."
"చాల్చాల్చాలు... అంతా నాకే యిచ్చేస్తారా యేమి టండీ?"
"ఈమాటు పుచ్చుకుందాం... మరి కానియ్యవేం?"
"పుచ్చుకోడానికి అసలు మీకు గుక్కెడేనా లేందే"
"ఇందాకా నీకో?"
"......."
"......."
"కోపం వచ్చిందా?"
"రాదా యేమిటి నువ్వు చేసిన పనికి?"
"..... ఏం?"
"గడ్డం పట్టుకున్నప్పుడు... ఇక యిద్దరికీ సమానంగా పంచు మరి"
".... ఏం?"
"నాకెక్కువ యిచ్చావు"
".... సరిగా లేదూ?"
"ఇంకాస్త తీసుకో"
"చూడండి"
"......."
"ఇంకాస్తా"
"........"
"ఇంకో రెండుచుక్కలు"
"......"
"వొక్కచుక్క"
"త్రాసు పట్టుకురానా?"
"అరచుక్కా... ఆc! సరిపోయింది. ఇక పుచ్చుకో...."
"మీతో సరిగా వాటా పెట్టాలా నాకూ?"
"కష్టపడి తయారుచేసినందుకు నీకే యెక్కువ వుండాలి న్యాయానికి"
"మరి వొక్కచుక్కా - అరచుక్కా - అంటూ తూచినట్టు పంచారేం?"
"వోడిపోయాను...."

"దురుసుతనం యెప్పుడూ పనికిరాదుసుమండీ"

"......"

"తప్పుమాట అన్నానా?"

"......."

"మళ్లీ కోపం వచ్చిందా?"

"......."

"ఏంచేస్తే పోతుందో చెప్పండీ మీకోపం?"

"నావాటా నీవాటా కలిపి-"

"నోటికి పోతుందా?"

"పానకాలరాయడు లాగ-"

"మహాబాగా జ్ఞాపకం చేశారండీ. మంగళగిరి వెడదామా వోమాటు?"

"ముందీ సంగతి తేల్చు"

"అయితే వొకటి చెప్తా వినండి"

"ఏమిటది?"

"ఎల్లుండి మీరు విశాఖపట్నం వెడతారు కాదూ?"

"వెడితే?"

"అప్పుడు నావాటా, మీవాటా కూడా నేనే పుచ్చుకుంటాను లెండి"

"అక్కడ నేనే మరో కప్పు యెక్కువ పుచ్చుకుంటానేమో?"

"నేను చూడవచ్చానా యేమిటి?"

"నేనుమాత్రం చూడవచ్చానా యేమిటి?"

"....."

"మాట్లాడవేం?"

".....కాఫీ చల్లారిపోతోంది చూశారా?"

"అదిగదీ! చివరికి అలా తీసుకురావాలి పాయింటు దగ్గిరకి... మరి కానియ్యి...."

"......."

"......."

"ఏమండి! మంగళగిరి మాట చెప్పరూ?"

".... వెళ్ళాలని వుందా?"

"ఎన్నాళ్లనుంచో వుందండీ. ఒక్క మాటు వెడదాం. మళ్లీ నాలుగురోజుల్లోనే తిరిగివద్దాం. ఏం? పాతిక రూపాయలే కాదూ జీతం నష్టం?"

"....పైగా ఖర్చులో?"

"మూడోక్లాసులో వెడదాం...."

"........"

"ఏం, నవ్వుతారేం?"

"అది మాత్రం వూరికే వస్తుందా?"

"పదయిా చోట అయి దయితే చాలు. అది లాభం కాదూ?"

"..... ఒక్క షరతుకి వొప్పుకుంటావా?"

".... ఏమి టదీ?"

".... మనం... దేవుడికి సమర్పించడం.... పానకం కాదు"

"మరేమిటీ?....."

"......"

".... కాఫీ యిద్దామా?

"......"

"మీభక్తికి తప్పకుండా మెచ్చుకుంటాడు"

3

"ఒక్కమాటు గదిలోకి వస్తానండీ"

"ఎందుకూ?"

"....."

"రహస్యమా?"

"......."

"అంత తొందరా?"

అప్పుడే ఆలస్యం లోనే చేరిపోయింది"

"అయితే అడగడ మెందుకూ?"

"......."

"ఉండువుండు. కుర్చీ వెనక్కి జరుపుకోనియ్యి"

"మీరు లేవనక్కరలేదండీ"

"రాణీగారికి ప్రత్యుత్థానం-"

"అబ్బ!"

"ఇదిగో సింహాసనం. దయచెయ్యాలి!"

".....నాకేం?"

"అదేమిటి?"

"ఊc అంటే అయిపోయీదానికి ఆలస్యం చేసుకుంటున్నారు మీరు"

"తగిన ఫలం వుండకపోదులే"

"......."

"ఊఁ... ఏమిటి తరవాయి?"

"మీకు కాఫీ సరిపోయిందా?"

"......"

"తృప్తి అయిందా?"

"ఆమాటెందుకూ యిప్పుడూ?"

"చెబుదురూ!"

"ఇప్పటిదాకా జ్ఞాపకమా?"

"వులకం!"

"......."

"ఉండండి.... చెప్పరూ?"

"జ్ఞాపకం చేసుకోనియ్యి"

"......"

"మనస్సు చెదిరిపోతోంది"

"... ఇంకా... పోతోందా... మెల్లిగానూ?"

"హాయ్.... హాయ్!.... పొరపాటే.... ఏదీ?...."

"..... వుండండీ"

"..... నువ్వే..... వుండరాదూ?"

".... చూశా.... రా?"

"......."

"క్షీ......."

"........"

"ఇక లేవనివ్వండి"

"వచ్చిన పని-"

"ఇంకెందుకూ?"

"సెబాస్!..... రుక్కూ!"

"రుక్మిణీ!"

"......"

"నాకేసి చూడూ"

"......"

"సిగ్గొచ్చిందా?"

"......."

"ఛా! .... ఇలా చూడూ.... నీరుణం తీర్చుకోడం యెలాగా?"

".... నామాట కేం, మీకవిత్వం మీరు చేసుకుందురూ"

"అవునవును. దీని కదే తగింది. కవిత్వాని కింతకంటే వుద్దీపనం యేం వుందీ? వురకలు వేసుకుంటూ వచ్చేస్తోంది ప్రవాహం"

"అయితే, నేను వాకిట్లోకి వెళ్లిపోతాను బాబూ. అందులో మునిగిపోతా నేమోనూ"

4

"రుక్కూ!"

"......."

"రుక్మిణీ!"

"......"

"రుక్మిణీదేవీ!"

"......"

"హృదయేశ్వరీ!"

".... మీకు లేకపోతే పోయింది, నాకేనా వుండొద్దుటండీ సిగ్గూ?"

"వద్దన్న వా రెవరూ?"

"మీధోరణి చూస్తే సంసారం అంటే నాటకం అనుకుంటున ట్టున్నారు మీరు"

"అస లిప్పు డేం వచ్చిందీ?"

"ముద్దిముద్ది పేర్లూ పెట్టి పిలిస్తే - "

"పిలిస్తే?"

"వాళ్ల జానకమ్మ ముక్కుమీద వేలుపెట్టుకుంది వినీ"

"పానకంలో-"

"స్స్! వినపడుతుం దండీ"

"ఎక్క డుం దేమిటి?"

"ఇప్పు డిప్పుడే గుమ్మం-"

"ఎక్కిందా దిగిందా?"

"మీపిలుపులవరస చూసి బేజా రయిపోయి, వచ్చిన దారినే వెనక్కి మళ్లింది"

"ఇంకేం మరీ?"

"వినపడితే?"

"ఇప్పుడూనా?"

"......"

"......"

"ఎందుకూ పిలిచారూ?"

"కూచో చెబుతాను"

"......."

"కూచోమరి"

"ఇలా చాలాదూ? ఇది బాగా లేదూ?"

"అదో అందం; కాని నీమొగం చూడా లంటే వెనక్కి విరగబడాలి. నువ్వు కుర్చీలో కూచుని నేనే వెనక నిలబడితే మరీ బాగుంటుంది. కదూ?"

"మరే - పా-పం... పోనీ యిప్పుడో?"

"అంతగా విరగబడనక్కర్లేదు"

"......."

"ఇందాకటికంటేనూ నయం"

"ఈమాటో?"

"మెల్లిగా అడుగుతున్నావా?.... వొళ్లు గరిపొడుస్తోంది... పారవశ్యం - "

"మీకవిత్వం - చెడగొడుతున్నా నని - కో - ప - పడ - కం - దేం?... అ-బ్బా! అ-బ్బా!....."

".....ప్చ్"

".....బాబోయ్!....."

"భయంలేదు, భయంలేదు. హెడ్‌మాస్టరుగార్ని పిలుస్తున్నాడు వాళ్ల జవాను"

"అమ్మయ్యా!"

"ఎవరినైనా మొత్తానికి రసభంగం చేశాడు వాడు. అయితే లే, యిలా రా, కూచో"

"గుండె లింకా కొట్టుకుంటూనే వున్నాయండీ"

"అమోఘమైన చికిత్స చేస్తాలే, మరి కూచో...."

".....వుండండీ.... ఎందుకో చెప్పండి"

"......"

"పద్యం రాశారా? దేనిమీద చెప్పరూ?"

"చూడరాదూ?"

"చదవండి"

"నువ్వు చదువూ"

"కవులు తమ పద్యాలు తామే చదవడం కూడా తప్పు కాదుగదా కొంపతీసి?"

"నాలాంటివాళ్ల దగ్గిర చదవడానికి కూడా యోగ్యత వుండాలి"

"బా-గా చెప్పారు, కనక మీరే చదవండి"
"అయితే విను-"
జాల మొకింతయున్ సయిపజాలని......
........ఒక ళ్ళొకళ్లపై
వ్రాలి, కవుంగిటన్ బెనగు పట్టుల నిగ్గులు దేరుప్రేమ....
......అతృప్తనయనమ్ముల ముగ్ధల దిద్ది తీర్చుతన్.
".... మధ్యమధ్య కాళీ లట్టే పెట్టారేం?"
"చేతకాకా"
"వులకం!"
"వేళాకోళం కాదు. అయినా నువ్వు పూర్తిచెయ్యి చూస్తాను"
"......."
"కానియ్యి మరీ... పొరపాటున నే నెత్తుకున్నాను గాని, అస, లిది, కవయిత్రీమతల్లు లెత్తుకోవలసిన ఘట్టం. అయితే, నువ్వు పూర్తిచేస్తే మాత్రం యిక నా తప్పుండదు"
"అ-లా-గేం? పా-పం!..... అయితే - మరి - యెక్కిరిపించరుకదా?"
"అబ్బే"
"తప్పొస్తే దిద్దుతారా మరీ?"
"నాతర మయితేనూ"
"చూశారా?"
"దిద్దుతాలే, దిద్దుతాలే"
"..... నవ్వకం డేం?"
"......"
"..... ఓరచూపులు చూస్తున్నారు"
"ఎంతసేపూ గునవడం?"
"అన్నీ కుదరాలా మరీ?.....
జాల మొకింతయున్ సయిపజాలని రాధయు-
"రాధా?"
"మరెవరూ?"
"........
జాల మొకింతయున్ సయిపజాలని రుక్మిణియున్-
"నేను చెప్పలేదూ? మీ రెప్పుడూ నా మీదే పట్టిస్తారు...."
"ఇదిగో"
"......"

"ఇలా రావూ?"

"ఏమో బాబూ!"

5

"ఏమంటావ్?"

"మీరే మంటారూ?"

"నిన్ను వెళ్ళ మంటాను"

"......"

"దసరాకీ వెళ్ళక, దీపావళికీ వెళ్ళక, చివరికి సంకురాత్రికేనా వెళ్ళకపోతే ఘోరకలి అనిపించుకోదూ?"

"........"

"పైగా, మీచెల్లెలూ మరిదీ కూడా నాలుగురోజుల కిందటే వచ్చారుట"

"......"

"నిరుడు మనం బొంబాయిలో వుండిపోయాం కనక నెపం లేకపోయింది. ఈయేడు ఇంటోనే వుండికూడా-"

"మీకు సెలవు లేనప్పు డేం చేస్తామూ?"

"నువ్వు వెళ్ళడాని కేం? నేను శరీరం అమ్ముకున్నాను. నీకేం అడ్డూ?"

"నేను మనస్సూ, హృదయమూ కూడా ధారపోసుకున్నాను....."

"....ధన్యోస్మి.... రుక్కూ! మాటిమాటికీ నీయెదటే నిన్ను స్తుతి చెయ్యడం పెద్దమనిషితరహా కాదు. మూడువందల రూపాయల జీతమూ, బాధ్యత గల పదవీ నీకాలిగోటికి పోలవు. అవేనా, నువ్వు నాపాలిటి భాగ్యదేవతవు కనకనే వచ్చాయి. నిజంగా నాఅంత సిరిగల భాగ్యశాలి మరొకడు లేడు; కాని మీ అమ్మగారూ, మీ నాన్నగారూ పెద్దవారైనారు. వారి ముచ్చట్లకి లోటు చెయ్యడం-"

"మీరు రాకుండా - మిమ్మల్ని విడిచి నేను వెళ్ళలేనండీ"

"ఇలా చూడూ... ఇదిగో.... ఒక్క క్షణం నామెడ విడిచిపెట్టి నాకేసి చూడవూ?"

"......"

"ఒక్కమాట విను. అంతే"

"......"

"పోనీ, అవిరళితకపోలంగా నేనా వొక్కమాటు మొగం యిలా తిప్పుకో"

"......"

"....వెళ్ళవూ?"

"........"

"నలుగురూ నాలుగు విధాలా నన్నంటారు"

"ఎవళ్ళ మంచిచెడ్డ లెవళ్ళకి తెలుస్తాయీ?"

"....ఇంకేం చెప్పనూ?"

"కథ చెప్పండి"

"శాస్త్రం చెప్పినట్టుంది.... చివరికి మీ అమ్మగారికి నీమీదకూడా కోపం వస్తుంది"

".... చిన్న వుత్తరం చూడండి"

"నీకు కూడా రాశారూ మీ నాన్నగారూ? ఇంకేం?.... ఇది మీ అమ్మగారి. దస్తూరీ"

"చదవండి"

"నాకన్నతల్లిని దీవించి-"

"ఇంకా ముందు"

"మీ రిద్దరూ రావడమే-"

"ఇంకా ముందు"

"పోనీ, అతగాడికి సెలవు పుట్టదంటే నిజమే. అయితే, నువ్వేనా తప్పకుండా రావాలి. తప్పదు. నువ్విదివరకే రానందుకే చెల్లాయి నన్ను నిలవనివ్వడం లేదు. నీజవాబు చూసుకుని, నువ్వు రమ్మన్ననాటికి మీనాన్నగారు వస్తారు... చూశావా? మీ అమ్మగారు రాసింది చాలా న్యాయంగా వుంది... పోనీ, వీలుంటే నేను రానివాణ్ణా?"

"రెండో వుత్తరం కూడా చూడండి"

".... ఇది మీ చెల్లాయి రాసింది. ఇప్పుడేనా వెళ్ళకపోతే-"

"చదవండి"

"అక్కయ్యకీ, అక్కయ్యపరంగా బావగారికీ నమస్కారాలు-"

"ఇంకా ముందు"

"నేను మొన్న ఆదివారమే సపరివారంగా – సెబాస్! మహామంచి మాట వేసింది మరద లిక్కడ"

"పదిబంతుల తరవాత చదవండి"

"బావగారికి సెలవు లేకపోతే నీకూ సెలవు లేదా యేమిటమ్మా? – చూశావా? చివరికి ముక్తాయింపు నామీద – "

"మరో నాలుగుబంతులు దాటించి చదవండి"

"రేపు సాయంత్రం – ఆరుగంటలకి – రైలుకారులో వస్తావా, సంతోషమే. లేకపోతే, నీకోసం – అంటే నిన్నిక్కడికి తీసుకురావడానికి ఎల్లుండి పొద్దుటి పాసెంజరులో నేను వస్తున్నాను. అప్పటి కేనా నువ్వు ప్రయాణం తెమల్చుకుని,

నాకోస మేనా స్టేషనుకి వస్తే, అక్కణ్ణుంచే వెనక్కి మళ్లి, మెయిలెక్కి మనం కాకినాడ రావచ్చు..... చూశావా?.... ఇక మోటతనం అనిపించుకుంటుంది. నామాట విను"

"........"

"పోనీ, వచ్చి మీఅక్కయ్యని తీసుకువెళ్ళవలసిందని మీ చెల్లాయికి రాయనా?"

"ఓపనిచేస్తారా?"

"ఏమిటదీ?"

"కోప్పడరుగదా?"

"ఎప్పుడేనా వుందా?"

"......"

"....."

"చెప్పెయ్యనా?"

"ఆలస్యం యెందుకూ?"

"మా చెల్లాయినీ మా మరిదినీ-"

"ఇక్కడికి తీసుకు వద్దామా? చాలా బాగుంది"

"......."

"సెబాస్!.... అయితే వెళ్లి పిలిస్తే గాని బాగుండదు.... పగలు వీల్లేదు కనక రాత్రిబండిలో వెళ్లిపిలుచుకు రానా?"

"రాత్రి నే నొక్కత్తినీ వుండనా యిక్కడా?"

"తెల్లవారే టప్పటికి వచ్చెయ్యనూ?"

"నా కేమీ తోచదండీ.... ఒక్క కును కేనా రాదు. తెల్లవారే దాకా మంచం నడు మెక్కి కూచోవాలి"

"పోనీ, మనం యిద్దరమూ వెడదామా?"

"ఏం బాగుందో బాగుంది. ఈమాత్రం భాగ్యానికి-"

"మీ చెల్లాయి కోసం కా దిదంతానూ. మీ మరిది-"

"అతగా డేం ఆకాశంనుంచి వూడిపడ్డాడా యేమిటి? నే నుత్తరం రాస్తాను జవానుని పంపండి"

"నాకు ధైర్యం చాలడం లేదు"

"అదంతా నేను చేస్తాను కాదూ?... మా చెల్లాయి మాటకి అడ్డు చెప్పగల డేం అతనూ?"

"అసలు మీ చెల్లాయి మాట?"

"అది వోఠ్ఠి వెర్రిపిల్ల. నావుత్తరం చూసిం దంటే యెగిరిగంతు వేసుకుంటూ వస్తుందది"

"అయితే చిక్కే"

"ఏం?"

"ఇదేమి టండోయ్, మీ మరదలు - అంటూ నలుగురూ నన్ను చూసి నవ్వుతా రేమో గదా?"

".... మీ కొంటెమాటలు.... ఏం?"

"హోయ్, హోయ్!"

"......"

బుగ్గపోటుకంటే యిదే బాగుంది. పార్వతీ పరమేశ్వరుల కేనా యింత యేకీభావం వుండదు"

"నాకు కోపం వచ్చిందంటే బాగా జరగదు, ఏమనుకున్నారో?"

"ఏదీ, ఆమాట నాకేసి చూస్తూ అనూ"

"..... ఏమండీ, మాచెల్లాయిని తీసుకురావద్దూ?"

"నేను వద్దనగలనా? కాని వారి నిద్దర్నీ తీసుకువచ్చి మీ అమ్మగారినీ, మీనాన్నగారినీ-"

"పచ్చిపులుసూ అన్నమూ తినమని పండుగల్లో వారి నిద్దర్నీ అక్కడ అట్టేపెడతామా యేమిటి?"

"అలా అన్నావు బాగుంది. ఈమాటు నాకు నచ్చింది"

"ఉత్తరం రాసి తీసుకురానా?"

"తీసుకురా"

"ఎందు కేనా మంచిది, మానాన్నగారికీ, మామరిదికీ కూడా మీరు రాయండి"

"అలాగే"

"మా అమ్మగారికి మాత్రం నేనే రాస్తాలెండి"

"సరే"

"..... పోనీ, యీపాటికి వంట అయిపోతుందేమో, కుక్కరు దింపి, అన్నీ సిద్ధం చేసి మిమ్మల్ని పిలవనా, ముందు వుత్తరాలు రాసుకురానా?"

"పది నిమిషాల్లో రాయలేవూ?"

"అంతసే పెందుకండీ నాలుగేసి మాటలు రాయడానికీ?"

"పుట్టింటికి వుత్తరం రాయడం అంటే కలమూ కాగితాలూ పుచ్చుక్కూచోడం తొరగా తెముల్తుంది; కాని ముగించడం మాటలతో యెప్పుడూ కాదుగా?"

"అలాగేం?.... ఎప్పుడో, పొద్దున్న అనగా పుచ్చుకున్న కాఫీ. మీరు రాయమన్నారు కనక విధిలేక వొప్పుకున్నాను గాని, లేకపోతే, కసింత ధారకంపడితే గాని నావల్లకాదు బాబూ వుత్తరాలు రాయడం. కాకపోయినా, మావాళ్ల కసలు వుత్తరమే అక్కర్లేదూ. కాకిచేత కబురు పంపితే వచ్చేస్తారు"

"అయితే యిక వుత్తరం యెందుకూ కాగితాలూ దండుక్కీ?"

"మామరిదికి రాయా లన్నారు కాదూ మీరూ?"

"అతనికి నేను రాస్తాను కాదూ?"

"మీతమ్ముడికి మీరు రాశాటప్పుడు మాచెల్లాయికి నేను రాయకూడదు టండీ?"

"......"

"కాకపోయినా, మీరు రాత పూర్తిచేసి భోజనానికి వచ్చేదాకా నేను గోళ్లు గిల్లుకుంటూ కూచోడమే కాదుటండీ?"

"......"

"పోనీ, మా అమ్మగారికీ, మా చెల్లాయికీ కలిపి వొక్క వుత్తరమే రాస్తాను లెండి మీ కంత కష్టంగా వుంటేను"

"......"

"మా నాన్నగారికి మాత్రం, మీరు రాసిన వుత్తరంలోనే నాలుగుబంతులు, కింద, రాస్తాను.... సరా?"

"ఇక నువ్వు రాయం దల్లా మీ మరిది వొక్కడికీనీ"

"మీరు రాయవలసిం దంతా రాశాక, "మీ వదినగారు యిక్కడికి రావలసిం దని నీకు రాయమని మరీ మరీ చెప్పిం దని మీరే రాసేయండి వొక్కమాట"

"మొత్తానికి నాటకంలో వొక్క అంకం అంత గ్రంథం నడిపావు"

"కష్టపడకుండా మీ నాటకంలో కొక అంకం దొరకడం మీకే నయం కాదూ?"

"అయితే, తక్కింది కూడా పూర్తిచేసిపెడతావా నువ్వు?"

"మామ్మే! కష్టపడి నేను రాస్తే, మీరు రాసినట్టు ప్రకటించుకుంటారు కామోసు పా - పం"

"పురుషుల అవ్యాజకరుణాకటాక్షంవల్ల, తెనుగుదేశంలో, యిప్పుడు, అక్షరజ్ఞాన మేనా లేని స్త్రీ లెంతమంది కవయిత్రీమతుల్లు లయిపోతున్నారో మరిచిపోయావా?"

"ఆసంగతి తెలిస్తే, ఆస్త్రీలు, ఆపురుషుల కెలాంటి సత్కారం చేస్తారో యేమేనా వూహించారా మీరెప్పుడేనా?"

".... గట్టిచిక్కే తెచ్చిపెట్టావు"

"దీంతో అయిపోయిం దనుకున్నారా యేమిటి? ఆంధ్రమహిళాసభలో యీ విషయం వొక తీర్మానం కూడా నెగ్గిస్తాను చూస్తూవుండండి"

"వద్దువద్దు. ఇంతటితో చాలించు నీకు పుణ్యం వుంటుంది. ఆ ఆడంగిరేకలవారిని అలాగేనా బతకనియ్యి. మరి వెళ్లి వుత్తరాలు రాసుకురా"

"నిమిషంలో వచ్చేస్తా నండీ; ఏం?"

"తొరగా వెళ్లు"

"....మీకు భోజనానికి ఆలస్యం అయిపోయింది పాపం! పోనీ, భోజనా లయినాక రాసి ఆఫీసుకి పంపిస్తానండీ"

"ఏమీ ఆలస్యం కాలేదు. ముందు వుత్తరాలే రాసుకురా"

"మాటల్లో పడి ఎంతపని చేశానూ?....."

6

".... ఇవాళ చేమకూర మంచి పాకాన పడింది సుమా?"

"మీరు నాహృదయం అంతా వుత్సాహంతో నింపేశారు కాదూ?"

"అయితే?"

"అంచేత పోగువు సరిగా పడింది"

"అదా కథా? అలా అయితే, నువ్వు చేసిన ఆదరం నన్నా నందసాగరతరంగాలమీద వూపెయ్యలేదూ?"

"...ఎటొచ్చినా విసురు నామీదే"

"తప్పుతుందా మరీ? నాలుగుగోడల మధ్యా వున్నంత సేపూ స్త్రీకి వుండే బాధ్యత పురుషుడి కేం వుంటుందీ?"

".... అయితే, మొగాడు కొంక నక్క అయితే ఆడ దేం చెయ్యగల దండీ?"

"తల్లి, బాధ్యత తెలిసిం దయితే వా డలా కొంక నక్క కాడుగా?...."

"......"

"దీనివల్ల మొగాడు ఏంచేసినా చెల్లిపోతుం దనీ, ఆడదానికీ, సంసారంలో, కష్టం తప్ప మరేమీ లేదనీ అనుకోకు. మొగాడు సంసారంలో కేవలమూ వుపకరణం.... వివరంగా చెబుతాను విను. మొగాడు పదునైన బాకు అనుకో. వీరుడి తెలివితేటలను పట్టే కాదూ ఆబాకుకి వినియోగం?"

"అయితే, మన పెద్ద లంతా ఆబాకుని చంటిపిల్లల చేతి కిస్తున్నా రన్నమాట కాదు టండీ?"

"ఇంకా సందేహమేం?.... చదువు చెప్పించక - చిత్తానికి పరిణతి కలిగించక - హృదయానికి వుత్తేజనం యివ్వక - చిన్నతనంలోనే ఆడదానికి పెళ్ళిచెయ్యడం అంటే అంతే కాదూ అర్థం?"

"..... మానాన్నగారు మంచివారు కారుటండీ?"

"కనకనే నే నదృష్టవంతుణ్ణి-"

"రెండు ముక్కలు వెయ్యనా?"

"ఇంకెందుకూ, చారుకూడా అయిపోయాకా?"

"......"

"......"

"ఎంత కమ్మగా వుందో మీగడ?......"

"ఎంత తియ్యగా వున్నాయో పాలు?....."

"కొత్తగొల్లాడు మహా మంచివాడు సుమండీ పాపం"

"పండుగుల్లో వాడి కవీ, యివీ పెట్టకపోతే మాత్రం తెలుస్తుంది పాపమో పుణ్యమో"

"పెద్దపండుగునాడు పెళ్ళాన్ని తీసుకుని విందుకు రమ్మన్నా నండీ వాణ్ణీ...."

".... మంచిపని చేశావ్! అయితే యీపండుగుల్లో మన యింటో వుండేవాళ్లంతా జోడాలే అన్నమాట...."

"..... అలా అయితే వోచిక్కు వచ్చిందే?"

"ఏమిటదీ?"

".... పనిమనిషి వితంతువు కదా?"

"ఓహోహో! చిక్కే!.... అయితే పండుగు నాలుగురోజులూ దాని కోడల్ని రమ్మను పనికి. పెద్ద పండుగునాడు, దాన్ని, మొగుణ్ణి తెచ్చుకోమను విందుకి"

"ముసలిముండ యేడవదూ?"

"ఏడ్చినా సరే, ... మరేం చేస్తాము? మనయింటో విజ్జోడు వ్యవహారాలు పనికిరావు. కాకపోతే, దానికి పెట్టవలసిం దేదో కోడలి కిచ్చి యింటికి పంపేసెయ్యి"

"అంతే కదా పాపం? మహా మంచి ముండ సుమండీ అదీ?"

"అంచేత నేనా యేమిటి ముండ అంటున్నావు?"

"......"

"నవ్వుకుని వూరుకుంటావేం?"

"మీమీద సొద్దూ"

"నిన్నరాత్రీ ముందు నువ్వే లేచావుగాదూ?"

"అ-వ్-వ"

"ఏం?"

"చాల్లెండి నేర్చుకున్నారు. ప్రతీపూట యిద్దరమూ ఏకబంతిని తింటున్నా మని అందరికి తెలవాలి కాబోలు"

"ఇదివరకే తెలుసు నందరికీనీ. మనల్ని చూసే హెడ్‌మాస్ట గారు కూడా యేకబంతి మొదలుపెట్టారు"

"కూచోండి అలాగ మీయిష్టం వచ్చినంత సేపు"

"......"

7

"ఈరెండాకులే. ఇవి వేసుకోకపోతే నన్ను చంపుకుని-"

"రుక్కూ! నువ్వు నన్నెలా విడిచిపెట్టలేకుండా వున్నావో, నిన్నూ నే నలాగే విడిచిపెట్టలేకుండా వున్నాను; కాని అప్పుడే పదకొండూ అయి దయింది. ఇక్కడికే అయిదు-"

"ఆఫీసు కంతటికి మీరే పెద్ద కదా, మిమ్మల్ని అడిగేవా రెవ రండీ?"

"నేనే తప్పు చేసి యిక గుమాస్తాల నేం ముదలకించనూ?"

"......."

"మళ్లీ చిలక చుడుతున్నావు. చూశావా?"

"ఇక మిమ్మల్ని బలవంతపెడితే అడగండి, ఈచిలకలో సగం....."

"..... ఇక లే"

".... ప్చ్..."

"..... పాగా"

"..... జుట్టు కొంచెం చెదిరిం దండీ"

"పాగా పెట్టుకుంటే.... ఏం?"

"......"

"......"

"......"

"లోపలికి వెళ్ళు"

"మీరు సైకిలుదగ్గిరికి వెళ్లండి"

"..... ఇక వెళ్ళు"

"సైకిలు స్టార్టు చెయ్యండి"

"..... ఊ"

"ఎక్కండి"

"..... వెళ్ళు మరి"

"ఒక్క నిమిషం... అరనిమిషం... క్షణం... ఉండరూ?. ఉండరూ?..... దిక్కుమాలిన బస్సు, ఇదెక్కడ వచ్చిం దమ్మా మమ్మల్ని విడతియ్యడానికీ?......

(ప్రబుద్ధాంధ్ర - నవంబరు, 1935)